సాక్షి
కృష్ణాజిల్లా

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



అలంకరణ సామగ్రికి.. వరద మరక

వరద అన్ని వర్గాలను ఇబ్బందుల పాలుజేసింది. అన్ని రంగాలను కోలుకోలేని దెబ్బ కొట్టింది. అటు పరిశ్రమల నుంచి చేతి వృత్తిదారుల వరకూ తీవ్రంగా నష్టపోయారు. -8లో▸



వైభవంగా గిరి ప్రదక్షిణ

పౌర్ణమి పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ బుధవారం వైభవంగా జరిగింది. ఈవో కేఎస్ రామరావు, ఆలయ అర్చకుల పూజలతో ప్రదక్షిణ ప్రారంభమైంది. -8లో▸



ఏటీఎంల తనిఖీ

బందరు శివారు ప్రాంతాల్లో ఉన్న ఏటీఎంలను కృష్ణా ఎస్పీ ఆర్. గంగాధరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతను పెంచాలని సూచించారు. -8లో▸

మహిళలకు ఆశ చూపారు



18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఎన్నికల వేళ ప్రతి సభలోను, ప్రతి సమావేశంలోనూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఆడబిడ్డకు రూ.1500 ఇస్తామంటూ మహిళలకు ఆశ చూపారు. ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు అవుతోంది. దాటింది. ఇప్పటి వరకు ఇచ్చిన హామీలపై ఏ విధమైన స్పష్టత లేదు. హామీ ఇచ్చాక దాని ఊసే మర్చిపోతే ఎలా? నెలకు రూ.1500 పథకం ఎప్పుడు అమలవుతుందా అని ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలి.

- బదుగు నాగలక్ష్మి, కలపటం, గూడూరు మండలం

సాగు పెట్టుబడి ఎప్పుడు ఇస్తారో..



అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తామని కూటమి నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ మాటలను రైతన్నలు నమ్మారు. ఖరీఫ్ సీజన్ ఇప్పటికే ప్రారంభమైంది. ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ ఊసేలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. పంటకు ఎరువులు కొట్టాలంటే అరువు తెచ్చుకోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా నిధులు నేరుగా రైతుల కాతాల్లో జమ చేసేసేవారు. దాని వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరేది.

- పర్వం మహాలక్ష్మయ్య నాయుడు, మల్లవోలు, గూడూరు మండలం

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో..



కూటమి అధికారం లోకి వచ్చిన వెంటనే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. కూటమి అధికారం చేపట్టి 100 రోజులు గడిచాయి. ఇంత వరకు భృతి ఊసేలేదు. భృతి కోసం నిరుద్యోగ యువత ఎంతో ఆశగా ఎదురు చూస్తోంది. ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిరుద్యోగ భృతి అందించేలా చర్యలు తీసుకోవాలి.

- ఆకుల బాబీకుమార్, నాగాయలంక

ఉచిత బస్సుపై స్పష్టత ఇవ్వాలి

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని కూటమి నాయకులు ప్రచారం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ పథకాన్ని అమలు చేయాలి. ఆగస్టు 15వ తేదీ నుంచి అమలు చేస్తామన్నారు. అది జరగలేదు. అసలు ఇప్పటి వరకూ విధివిధానాలు ఏమిటో కూడా ప్రకటించలేదు. రాష్ట్రమంతా ఉచిత ప్రయాణం కల్పిస్తారా లేక జిల్లాలకు మాత్రమే పరిమితం చేస్తారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో కూడా స్పష్టత ఇవ్వాలి.

- ఎస్.ఫణికుమారి, 14వ వార్డు, పెడన

ఎదురు చూస్తున్నాం

ఎన్నికల ప్రచారంలో ప్రతి ఒక్కరికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే ఇంటి ఖర్చులు తగ్గిపోతాయని ఎంతో సంతోషించాం. కూటమి అధికారంలోకి వచ్చింది. గ్యాస్ సిలిండర్ల కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పుడు దీపావళికి ఇస్తామని చెబుతున్నారు. కచ్చితంగా అమలు చేసి, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

- దావు కోటేశ్వరమ్మ, పెద్దప్రోలు, మోపిదేవి మండలం

• బాబు వస్తేనే జాబ్‌లు



ఆంధ్రజ్యోతి పత్రిక క్లిప్పింగ్

2024 ఏప్రిల్ ఏదో తేదీన చంద్రబాబు పామర్రు, ఉయ్యూరులో ప్రజాగళం పేరుతో బహిరంగ సభలు నిర్వహించారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తా.. మెగా డీఎస్సీ పెడతా.. ఉద్యోగాలు ఇస్తా.. జాబ్ కేలెండర్ ఇస్తా.. మేమొచ్చాక రైతే రాజు. బాబు వస్తేనే జాబ్‌లు వస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు' అంటూ చంద్రబాబు గొప్పల దప్పుకొట్టారు.

ఆర్థిక భరోసా ఏదీ..

మే 5వ తేదీన గన్నవరం టీడీపీ అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలతో ఆర్థిక భరోసా లభిస్తుందంటూ ప్రజలకు హామీలు ఇచ్చారు. ఆర్థిక భరోసా ఏది అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



ఆంధ్రజ్యోతి పత్రిక క్లిప్పింగ్.. ప్రచారంలో యార్లగడ్డ

గన్నవరంలో మరో సూపర్ సిక్స్



ఆంధ్రజ్యోతి పత్రిక క్లిప్పింగ్: యార్లగడ్డ ఇంటర్వ్యూ

మే 11వ తేదీన ఆంధ్రజ్యోతి పేపర్‌లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఇంటర్వ్యూ ప్రచురితమైంది. 'మా పార్టీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారు. నేను నా గన్నవరం నియోజకవర్గ ప్రజలకు వెంకట్రావు మరో సూపర్ సిక్స్‌ని ప్రకటిస్తున్నాను' అంటూ తన ప్రాధాన్యతలను ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

• పత్రికల్లో ప్రకటనలు



కూటమిని గెలిపించాలని మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బోడె ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందంటూ హామీలు గుప్పించారు. సూపర్ సిక్స్ పేరిట మే 11వ తేదీన తమ అనుకూల పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు.

బాబు సూపర్ 6 మోసం ఫిక్స్





ఇంటికో ఉద్యోగం / నిరుద్యోగ భృతి

- జిల్లాలో మొత్తం నిరుద్యోగుల సంఖ్య : 8 లక్షలు
- ఒక్కొక్కరికీ నెలకు ఇవ్వాల్సిన మొత్తం: రూ.3 వేలు
- నెలనెలా ప్రభుత్వం ఇవ్వాల్సిన మొత్తం : రూ.240 కోట్లు




తల్లికి వందనం..

- ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్ల సంఖ్య : 1,789
- ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ జూనియర్ కాలేజీల సంఖ్య: 113
- పాఠశాల, ఇంటర్‌మీడియెట్ విద్యార్థుల సంఖ్య: 2.42 లక్షలు
- ఏడాదికి రూ.15 వేల చొప్పున చెల్లించాల్సిన మొత్తం : రూ.రూ.363 కోట్లు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

2011 లెక్కల ప్రకారం..

- జిల్లాలో మొత్తం జనాభా సంఖ్య : 17.35 లక్షలు
- వారిలో మహిళలు, బాలికల సంఖ్య : 9 లక్షలు
- ఇప్పటి వరకు ఈ పథకం అమలుకు సంబంధించి విధివిధానాలను ఖరారు చేయలేదు.



అన్నదాత సుఖీభవ

- జిల్లాలో మొత్తం రైతుల సంఖ్య : 2.70 లక్షలు
- కౌలు రైతుల సంఖ్య : 50 వేలు
- ఏడాదికి రూ.20 చొప్పున ఇవ్వాల్సిన మొత్తం : రూ.640కోట్లు



మహిళలకు ప్రతి నెలా 1500

- జిల్లాలో 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళల సంఖ్య : 7,39,202
- నెలకు చెల్లించాల్సిన మొత్తం : రూ.110.88 కోట్లు
- ఏడాదికి కావాల్సిన బడ్జెట్ : రూ.1,330.56 కోట్లు

ఏటా మూడు సిలిండర్లు ఉచితం

- మొత్తం గ్యాస్ కనెక్షన్ల సంఖ్య : 6,17,792
- ప్రస్తుతం సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర : రూ.825
- 3 సిలిండర్ల చొప్పున ఏడాదికి చెల్లించాల్సిన మొత్తం : రూ.152.39 కోట్లు

'సంపద సృష్టిస్తా.. సంక్షేమాన్ని చేరువ చేస్తా.. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా..' అంటూ చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించారు. కూటమి నాయకులు సైతం సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టారు. 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ' పేరుతో బాండ్లు, కరపత్రాలు ముద్రించి ప్రజలకు పంచారు. 'ఇవే బాండ్లు అనుకోండి.. ఈ పత్రాలను దాచిపెట్టుకోండి. మమ్మల్ని నమ్మండి. ఓట్లు వేసి గెలిపించండి' అంటూ గొప్పల దప్పులు కొట్టారు. అవి సూపర్ సిక్స్ పథకాలు కావని, ఆ హామీల్లో మోసం ఫిక్సయిందని ప్రజలు గుర్తించలేకపోయారు. వారి మాటలను నమ్మిన ప్రజలు కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించారు. కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారు. కూటమి అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా ఆరు గ్యారెంటీల్లో ఒక్కటైనా అమలు చేస్తే ఒట్టు. ఇలా మోసం చేయడం టీడీపీకి కొత్తేమీ కాదు. చంద్రబాబుకు అది వెన్నతో పెట్టిన విద్య. అసెంబ్లీలో సాధారణ బడ్జెట్‌కు బదులు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టి పథకాలకు నిధుల కేటాయించకుండా ఎగనామం పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. పైగా 'అసెంబ్లీ సమావేశాల్లో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. తాము ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చామని, అయితే ఇప్పుడు చూస్తే భయమేస్తోందని చెప్పడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ పథకాల కోసం లక్షల మంది కృష్ణా జిల్లా ప్రజలు ఎదురు చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- సాక్షి, మచిలీపట్నం

- ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ టీడీపీ, జనసేన నాయకుల ప్రచారం
- పామర్రు, ఉయ్యూరు, గన్నవరం, పెడన, మచిలీపట్నం పర్యటనల్లో చంద్రబాబు, పవన్ హామీలు
- కూటమి అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతున్నా ఏ ఒక్కటీ అమలుకు నోచని వైనం
- అసెంబ్లీలో సాధారణ బడ్జెట్‌కు బదులు ఓటాన్ బడ్జెట్‌తో నిధులు కేటాయించకుండా ఎగనామం

నిరుద్యోగ భృతి

సూపర్ సిక్స్‌లోని తొలి హామీ ఉద్యోగాల భర్తీ లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి. దీని కోసం జిల్లాలో సుమారు 8 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం జిల్లాలో మొత్తం 4.39 లక్షల ఇళ్లలో 17.35 లక్షల మంది నివసిస్తున్నారు. వారిలో 11.84 లక్షల మంది విద్యావంతులు. ఉద్యోగులు సుమారు 40 వేల మంది. ఉద్యోగాలకు దరఖాస్తు చేసే వయసు దాటిన వారు లక్ష మంది. ప్రాథమిక విద్య పూర్తిచేసిన వారు 2.44 లక్షల మంది ఉంటారని అంచనా. మిగిలిన 8 లక్షల మంది నిరుద్యోగులు. వారు ప్రస్తుతం ఉద్యోగ ప్రకటనలు, రూ.3 వేల నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు.

తల్లికి వందనం పథకం

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు కలిపి 1,789 ఉన్నాయి. అన్ని యాజమాన్యాల్లో జూనియర్ కాలేజీలు 113 ఉన్నాయి. వాటిలో 2.42 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఏడాదికి రూ.363 కోట్లు చెల్లించాల్సి ఉంది.

అన్నదాత సుఖీభవ

అన్నదాత సుఖీభవ అమలు కోసం జిల్లాలోని 2.70 లక్షల కౌలు రైతులు, 50 వేల కౌలు రైతులు ఎదురు చూస్తున్నారు. ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.20 వేల చొప్పున ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. 3.20 లక్షల మందికి ఏటా రూ.640 కోట్లు చెల్లించాల్సి ఉంది.

> జిల్లాలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ సూపర్ సిక్స్ పథకాలు, వాటి అమలుపై హామీ ఇచ్చి ప్రజలను నమ్మించారు. ఏప్రిల్ 8వ తేదీన పామర్రు, ఉయ్యూరులో, ఏప్రిల్ 17న పెడన, మచిలీపట్నంలో, మే 10వ తేదీన గన్నవరంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పర్యటనలు సాగాయి. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాగళం బహిరంగ సభల్లో సూపర్ సిక్స్ పథకాలను ప్రధానంగా ప్రస్తావించారు. సంపదను సృష్టించి వాటిని అమలు చేస్తామంటూ చంద్రబాబు నమ్మించారు.

ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు

- మహిళలను ఆకర్షించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కాపీకొట్టిన పథకం ప్రతి ఇంటికి ఏడాదికి 3 సిలిండర్లు. అధికారంలోకి వచ్చి 100 రోజులైనా అమలు నోచుకోలేదు. అయితే వచ్చే దీపావళి నుంచి అమలు చేస్తామని బుధవారం ప్రకటించింది.

దీనిని కచ్చితంగా అమలు చేయాలని మహిళలు కోరుతున్నారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.860 ఉంది. జిల్లాలోని 6,17,792 కనెక్షన్లకు ఏడాదికి అందించే మూడు సిలిండర్ల చొప్పున ఇచ్చేందుకు రూ.159.39 కోట్లు కావాలి.

మహిళలకు ప్రతి నెలా రూ.1500

కూటమి అధికారంలోకి వస్తే 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 17.35 లక్షలు ఉన్నారు. వారిలో మహిళలు 8.66 లక్షలు మంది. తాజా ఓటరు జాబితా ప్రకారం 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య వయసు మహిళలు 7,39,202 మంది ఉన్నారు. వీరంతా నెలకు రూ.1500 కోసం ఎదురు చూస్తున్నారు. వారికి రూ.15 వేల చొప్పున నెలకు రూ.110.88 కోట్లు, ఏడాదికి రూ.1,330.56 కోట్లు కావాలి.

ఉచిత బస్సు ప్రయాణం

- మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు కూటమి ఇచ్చిన మరో హామీ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం. ఇది కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కాపీ కొట్టిన పథకం. జిల్లాలో సుమారు 9 లక్షల మందికి పైగా బాలికలు, మహిళలు ఉచిత ప్రయాణం కోసం ఎదురు చూస్తున్నారు.

ఆర్థికంగా ఆదుకోవాలి



కూటమి అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి రూ.15 వేల చొప్పన ఇస్తామని మాట ఇచ్చారు. నాకు ఇద్దరు కుమార్తెలు. ఒకరు ఇంటర్, ఒకరు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. సెప్టెంబర్ సగం అయిపోయింది. తల్లికి వందనం పథకాన్ని సాధ్యమైనంత త్వరగా అమలు చేసి మమ్మల్ని ఆర్థికంగా ఆదుకోవాలి.

- సీహెచ్ సునీత, పెనమకూరు, తోట్లవల్లూరు మండలం

హామీ నిలబెట్టుకోవాలి



నాకు ముగ్గురు పిల్లలు. ఆర్థికంగా భారమైనా పిల్లల భవిష్యత్ కోసం వారిని ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నా. కూటమి అధికారంలోకి వస్తే తల్లికి వందనం కింద ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. మా ముగ్గురు పిల్లలకు కలిపి ఏడాదికి రూ.45 వేల సాయం వస్తే ఆర్థికంగా భరోసా దక్కుతుందని సంతోషించాం. త్వరితగతిన నగదు ఇస్తే ఆసరాగా ఉంటుంది.

- గోనే సౌజన్య, ఇమ్మనివానిగూడెం

భృతిపై భరోసా ఇచ్చారు



సార్వత్రిక ఎన్నికల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామంటూ కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మకంగా చెప్పారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడివాడ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సమయంలో ఈ హామీపై భరోసా ఇచ్చారు. కచ్చితంగా అమలు చేయాలి.

- బి. మహేష్, నిరుద్యోగి, గుంటాకోడూరు

బంపర్ హిట్

వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం ఇంటింటి తలుపు తట్టింది. ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ క్యాలెండర్ ఏర్పాటు చేసి మరీ హామీలు అమలు చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన.. ఇలా ఒకటా రెండా ఇచ్చిన ప్రతి హామీ అమలైంది. ఇంటింటా సంక్షేమం వెల్లివిరిసింది.

సచివాలయాలతో ఉపాధి

నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థ ద్వారా జిల్లాలో 508 సచివాలయాలు ఏర్పాటు చేశారు. వాటిలో 4,489 మందికి రెగ్యులర్ ఉద్యోగాలు కల్పించారు. మరో 9,274 మందిని గ్రామ/ వార్డు వలంటీర్లుగా నియమించి నెలకు రూ.5 వేల గౌరవం వేతనం ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీచేయడంతోపాటు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేశారు.

ఠంఛన్‌గా అమ్మఒడి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు అమ్మఒడి పథకం కచ్చితంగా అమలైంది. ఈ పథకం కింద 1,62,899 తల్లుల ఖాతాలోకి నేరుగా రూ.537.37 కోట్ల నగదు జమైంది.

ఖరీఫ్‌కు ముందే రైతు భరోసా

గత ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే అమలు చేసింది. ఐదేళ్లలో రూ.585.83 కోట్ల పెట్టుబడి సాయాన్ని జూన్‌లోనే చెల్లిస్తూ వచ్చింది. దీనికి తోడు పీఎం కిసాన్ రూ.452.5 కోట్లు అదనంగా రైతుల ఖాతాల్లో జమ చేసింది.

మహిళలకు ఆర్థిక స్వావలంబన

మహిళలను ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎన్నో పథకాలు అమలు చేసింది. చేదోడు కింద 12,243 మందికి రూ.27.04 కోట్లు, జగనన్న చేదోడు (వడ్డీ) కింద 30,791 మందికి రూ.1.30 కోట్లు, జగనన్న చేదోడు (రుణాలు) కింద 49,992 మందికి రూ.78.84 కోట్లు, వైఎస్సార్ చేయూత కింద 2,29,085 మందికి రూ.1,300.68 కోట్లు, ఆసరా కింద 3,03,694 మందికి రూ.884.51 కోట్లు చొప్పున మంజూరు చేశారు.



క్లుప్తంగా

వైభవంగా గిరి ప్రదక్షిణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమి పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి ప్రదక్షిణ బుధవారం వైభవంగా జరిగింది. దుర్గగుడి ఘాట్ రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద అలంకరించిన వాహనంపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్లు కొలువై ఉండగా, ఈవో కె.ఎస్.రామరావు, ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రదక్షిణ ప్రారంభమై కుమ్మరి వీధి, విద్యాధరపురం, సితారా జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, కేఎల్‌రావునగర్, చిట్టినగర్, కేటీరోడ్డు, బ్రాహ్మణ వీధి మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంది. గిరి ప్రదక్షిణలో పాల్గొంటే భక్తుల కోర్కెలు తీరుతాయని వారి నమ్మకమని ఆలయ అర్చకులు తెలిపారు.

ఏటీఎంలను ఎస్పీ తనిఖీ

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని శివారు ప్రాంతాల్లో ఉన్న ఏటీఎంలను కృష్ణా ఎస్పీ ఆర్.గంగాధరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలేఖాన్‌పేట, శివగంగ ప్రాంతాల్లో ఉన్న యాక్సిస్ బ్యాంక్ తదితర బ్యాంకుల ఏటీఎంలను పరిశీలించి పోలీసు అధికారులకు సూచనలు చేశారు. జిల్లాలోని బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతను పెంచాలని సూచించారు. శివారు ప్రాంతాల్లో నేరాలు జరగడానికి అవకాశం ఉన్న ఏటీఎంల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి సమయాల్లో గస్తీ పెంచడంతో పాటు నైట్ పెట్రోలింగ్ నిర్వహించి అధికారులు తరచూ తనిఖీలు చేయాలన్నారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి తప్పకుండా సెక్యూరిటీ గార్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల వద్ద ఎమర్జెన్సీ అలారం కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రూ.160 వేరుశనగ నూనె.. రూ.90కే విక్రయం!

- ఆయిల్ ట్యాంకర్ ఎత్తుకొచ్చి అమ్మకాలు
- ఎగబడిన జనం

ఎర్రుపాలెం(ఖమ్మం): ఎన్టీఆర్ జిల్లా నందిగామ నంచి వేరుశనగ నూనె లోడ్ ట్యాంకర్‌ను చోరీ చేసిన దుండగులు.. తక్కువ ధరకే అమ్ముతుండటంతో జనం ఎగబడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ట్యాంకర్‌ను చోరీ చేసి సోమవారం ఎన్టీఆర్ జిల్లా మైలవరం, పుల్లూరులో నూనె అమ్ముతూ ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం జమలాపురం, కండ్రిక, బంజర వరకు చేరుకున్నారు. మార్కెట్‌లో లీటర్ రూ.160 వరకు ధర ఉన్న నూనెను రూ.90కే విక్రయిస్తుండడంతో జనాలు ఆయిల్ టిన్నులు, క్యాన్లతో బారులు దీరారు. పోలీసులకు సమాచారం తెలియడంతో ఎస్ఐ పి.వెంకటేష్, సిబ్బంది చేరుకునేలోగా ట్యాంకర్‌తో వచ్చిన వారు జారుకున్నారు. దీనిపై విచారణ చేసిన ఎస్ఐ ఆయిల్ ట్యాంకర్ నందిగామకు చెందిన శ్రీవేంకటేశ్వర ట్రేడర్స్ యజమాని శ్రీనివాస నాగప్రసాద్‌కు చెందినద గుర్తించి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. యాజమాన్య బాధ్యులు చేరుకుని ట్యాంకర్‌ను తీసుకెళ్లి నందిగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటికే ట్యాంకర్‌లో సగం నూనె అమ్మేశారు.

రైతు విలవిల

- ఆర్థిక భరోసా కరవు
- వరదలతో నీట మునిగి కుళ్లిన పంటలు
- జిల్లాలో 48,641 హెక్టార్లలో పంట మునక
- ఎకరాకు రూ.20వేల వరకు ఖర్చు పెట్టిన రైతులు
- ఇప్పటికీ లెక్క తేలని పంట నష్టం
- వరద తగ్గి 12రోజులైనా కొనసాగుతోన్న నమోదు
- ఈ క్రాప్ నమోదు, యాప్‌ల్లో ఎంట్రీ నిబంధనలతో జాప్యం
- అధికారులు నష్టం ధ్రువీకరించే వరకు అలాగే పంటలు



'ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు గుండె రవి కుమార్‌ది ఉంగుటూరు గ్రామం. బుడమేరును నమ్ముకొని 25 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఎకరానికి రూ.20వేల వరకు ఖర్చు చేశారు. కౌలు సొమ్మును యజమానులకు చెల్లించారు. వరదల కారణంగా బుడమేరు ఉగ్రరూపంలో రావడంతో పాతిక ఎకరాల వరి పంట మునిగి, పది రోజులు నీటిలోనే ఉండి పోయింది. దీంతో పంట పూర్తిగా కుళ్లిపోయి నష్టం మిగిలింది. 25 ఎకరాలు పంట ఈ క్రాప్ నమోదు చేసుకున్నారు. అధికారులు పంట నష్టంగా నమోదు చేశారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. కారణం.. ఇంకా జిల్లాలో నమోదు ప్రక్రియ పూర్తి కాలేదు. నివేదిక ప్రభుత్వానికి పంపలేదు. ఫలితంగా రూ.5 లక్షల వరకు ఖర్చు చేసిన ఆయనకు భరోసా లభించలేదు.' ఇలా ఈయన ఒక్కరే కాదు.. జిల్లాలో 40వేల మంది వరకు వరదతో గాయపడిన అన్నదాతలకు గుండె కోతే మిగిలింది.

సాక్షి, మచిలీపట్నం: వరద దెబ్బకు రైతు విలవిలలాడుతున్నాడు. అన్నదాతకు గుండె కోతగా మారింది. వరద కారణంగా కృష్ణా జిల్లా రైతులకు ఆందోళన తప్ప.. ఆర్థిక సాయంపై స్పష్టమైన భరోసా కరువైంది. ఎగువ ప్రాంతంలో అధిక వర్షాల కారణంగా కృష్ణమ్మకు భారీ వరదలు వచ్చాయి. మరోవైపు బుడమేరు ఉగ్ర రూపంలో వచ్చింది. పంట పొలాలను ముంచేసింది. వారం రోజుల్లో రెండు సార్లు వరద రావడంతో చేలు చెరువులుగా మారాయి. పది రోజులకు పైగా పంటలు నీటిలోనే ఉండిపోయాయి. ఫలితంగా కుళ్లిపోయి దేనికీ పనికి రాకుండా పోయాయి. నష్టాన్ని అంచనా వేసేందుకు చర్యలు చేపట్టిన అధికారులు.. నమోదు ప్రక్రియను పూర్తి చేయలేదు. ప్రభుత్వం పెట్టిన ఈ క్రాప్ బుకింగ్, ఆన్‌లైన్ ఎంట్రీ, యాప్‌లో నమోదు వంటి కారణాలతో ఇప్పటికీ కొనసాగుతోంది.

అంచనాకు రాని పంట నష్టం

జిల్లాలో పంట నష్టం అంచనాకు రాలేదు. మొత్తం 48,641 హెక్టార్లు ముంపునకు గురి కాగా 44,521 హెక్టార్ల వరి, వేరుశనగ, మినుములు, చెరుకు, పత్తి తదితర పంటలు, 4,070 హెక్టార్ల ఉద్యాన, 50 హెక్టార్ల పట్టు పంటలు దెబ్బ తిన్నాయి. వరద తగ్గాక పంట నష్టం నమోదుపై అధికారులు దృష్టి పెట్టారు. రెవెన్యూ, వ్యవసాయం, ఉద్యాన అధికారులు పొలాలను పరిశీలించి నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్, యాప్ ఎంట్రీలతో జాప్యం జరుగుతోంది. దీంతో పంట నష్టం అంచనాకు రాలేదు. అయితే రూ.493.06 కోట్ల నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. 44,521 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు రూ.385.24 కోట్లు, 4,070 హెక్టార్ల ఉద్యాన పంటలకు రూ.107.82 కోట్ల అంచనా వేశారు.



మోపిదేవి మండలం కె. కొత్తపాలెంలో నీట మునిగిన పసుపు పంట

కష్టం వరద పాలు

జిల్లాలో 1.46లక్షల హెక్టార్లలో పంటలు సాగు కాగా ఇందులో అత్యధికంగా వరి 1.40 లక్షల హెక్టార్లు, పత్తి 300, వేరుశనగ 765, మినుములు 520, చెరుకు 265, మొక్క జొన్న 112 హెక్టర్లు సాగైంది. వరదల కారణంగా 44,521 హెక్టార్ల పంట వ్యవసాయ, 4,070 హెక్టార్ల ఉద్యాన, 50హెక్టార్ల పట్టు పంటలు ముంపునకు గురయ్యాయి. పొలం సేద్యం, నారు, నాట్లు, కూలీలు, ఎరువులు, మందులు ఇలా.. అనేక విధాలా సస్యరక్షణ చేస్తూ అన్నదాత కష్టపడ్డాడు. కానీ వరదల్లో వేల హెక్టార్ల పంట ముంపుతో రైతులు రెండు నెలల పాటు పడిన కష్టం అంతా కుళ్లిపోయింది.

రూ.2.40 లక్షల పసుపు పంట కుళ్లి పోయింది



పసుపు పంట కోసం రూ.40వేలు చెల్లించి ఎకరం పొలం కౌలుకు తీసుకున్నా. నారు, సేద్యం, కూలీలు, మందులు, ఎరువులు ఇలా రూ.2లక్షలు పెట్టుబడి పెట్టా. మొత్తం రూ.2.40లక్షలు అప్పు చేశాను. ఇప్పుడు వరదతో ఆ పంట అంతా నీట మునిగి కుళ్లి పోయింది. పంట చేతికొస్తే అప్పులు తీర్చి, కుమార్తెకు పెళ్లి చేద్దామనుకున్నా. పంటతో పాటు ఇష్టంగా పెంచుకున్న మూడు ఆవులు, రెండు దూడలు నదిలో కొట్టుకుపోయాయి. అప్పులు ఎలా తీర్చాలో, పిల్లల చదువు, పెళ్లిళ్లు ఎలా చేయాలో తలుచుకుంటే భయమేస్తోంది.

– జంపాన మాణిక్యాలరావు, కె. కొత్తపాలెం, మోపిదేవి మండలం

రెవెన్యూ అధికారి వేధింపులపై విచారణకు ఆదేశం

సాక్షి ఎఫెక్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: మహిళా రేషన్ డీలర్‌పై బాపులపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఓ కీలక అధికారి వేధింపులకు పాల్పడిన ఘటనపై కృష్ణా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ విచారణకు ఆదేశించారు. 'మహిళా రేషన్ డీలర్‌పై రెవెన్యూ అధికారి వేధింపులు' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై జేసీ స్పందించారు. ఈ ఉదంతంపై తక్షణమే నివేదిక సమర్పించాలని తహసీల్దార్ వి.నాగభూషణాన్ని బుధవారం ఆమె ఆదేశించారు. మహిళా డీలర్ నిర్వహిస్తున్న రేషన్ షాపు తెరిచేందుకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చినా ఆలసత్వం ప్రదర్శించటంపైనా ఆమె స్పందించారు. దీనిపై గన్నవరం, గుడివాడ, పామర్రులకు చెందిన ముగ్గురు పీడీఎస్ డీటీలను జిల్లా పౌరసరఫరాల అధికారి నియమించారు. సదరు మహిళా డీలర్ రేషన్ షాపునకు సరుకులు అప్పగించేందుకు ఈ ముగ్గురు అధికారులు బుధవారం సాయంత్రం ఇక్కడకు చేరుకున్నారు. ఘటనపై రెవెన్యూ అధికారి, మహిళా రేషన్ డీలర్ నుంచి వాంగ్మూలం తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు.

మినిస్టీరియల్ స్టాఫ్ నూతన కార్యవర్గం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ కార్యాలయం మినిస్టీరియల్ స్టాఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం కార్యాలయం ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎం.ఫణికుమార్, ప్రధాన కార్యదర్శిగా టి.సుధాకర్, కోశాధికారిగా ఎం.శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జె.చంద్రహరీష్, జి.హరితమ్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.నాగరాజు ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గానికి సభ్యులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ దాడి

- అర్ధరాత్రి కర్రలు, కత్తులతో వీరంగం
- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు



పేట పీఎస్‌లో బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి టీడీపీ శ్రేణులు కర్రలు, కత్తులతో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఇళ్లపై దాడులు చేశారు. దాడుల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కూడా తిరగబడటంతో ఇరువర్గాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఘర్షణలో ఇరు పార్టీలకు చెందిన వారు మొత్తం 14 మందికి గాయాలు కాగా, వారిలో 9 మంది వైఎస్సార్ సీపీ, ఐదుగురు టీడీపీ వారు ఉన్నారు. మొదట టీడీపీకి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ కర్ల శాంతకుమారి భర్త కర్ల జోజి, అదే ప్రాంతంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్త పిల్లి నానికి చిన్న ఘర్షణ జరిగింది. ఇది పెద్దదై మాటామాటా పెరిగి పెద్ద గొడవగా మారింది.

ముందస్తు ప్రణాళికతో టీడీపీ దాడి

అప్పటికే ముందస్తుగా ప్లాను ప్రకారం ఉన్న టీడీపీ వారు ఒక్కసారిగా 20, 30 మంది కర్రలు, రాళ్లు, కత్తులతో దాడికి పాల్పడ్డారు. దీంతో టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ గాయపడ్డాడు. ఘర్షణలో వైఎస్సార్ సీపీకి చెందిన రుంజ హైమావతి, పిల్లి జ్యోతి, రుంజ కమల, పిల్లి క్రాంతికుమార్, ముచ్చు లక్ష్మయ్య గాయాలతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడి అరెస్ట్ అయిన వైఎస్సార్ సీపీకి చెందిన రుంజ నాగయ్య, రుంజ రాజా, రుంజ చంటి, చలవాది దిలీప్ ఉన్నారు. టీడీపీకి చెందిన ఐదుగురు గాయపడగా, మెరుగైన చికిత్స కోసం వారిని విజయవాడకు తరలించారు. నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సీఐ జానకీరామ్ పర్యవేక్షణలో పేట ఎస్ఐ వెంకటేశ్వరరావుతో పాటు సర్కిల్ ఎస్ఐలు శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు. ఎటువంటి ఘటనలు జరగకుండా క్రిస్టియన్‌పేటలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా క్విక్ రియాక్షన్ ఫోర్స్ బలగాలను రప్పించారు. పేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ తదితరులు పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

శరన్నవరాత్రులకు ఏర్పాట్లు ముమ్మరం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, చిత్రంలో సీపీ రాజశేఖర్‌బాబు, ఈఓ రామరావు, ఎమ్మెల్యే సుజనాచౌదరి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన చెప్పారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం వచ్చే అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ సృజన, సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు, ఎమ్మెల్యే వై.సుజనా చౌదరి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగిపడకుండా దేవస్థానం పటిష్ఠ చర్యలు తీసుకుందని అయినా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఉత్సవాల్లో ప్రతిరోజూ లక్ష మందికి పైగా, మూలా నక్షత్రం రోజు రెండు నుంచిమూడు లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. మూలా నక్షత్రం రోజు అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సీపీ ఎస్.వి. రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ జిల్లాకు చెందిన పోలీసులతో పాటు ఇతర జిల్లాల నుంచి 3,500 మంది సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నట్లు చెప్పారు.

5 క్యూ లైన్లు ఏర్పాటు

ఈవో కె.ఎస్. రామరావు మాట్లాడుతూ ఆన్‌లైన్ టికెట్ లేకుండా వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రిసెప్షన్, టోల్‌గేట్, ఓం టర్నింగ్, పున్నమి ఘాట్, వీఎంసీ ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్, స్టేట్ గెస్ట్ హౌస్, మోడల్ గెస్ట్ హౌస్, హెడ్ వాటర్ వర్క్స్, బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల వద్ద కరెంటు టికెట్ బుకింగ్ కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. వినాయకుడి గుడి నుంచి టోల్‌గేట్ ద్వారా కొండపైన ఓం టర్నింగ్ వరకు మూడు క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓం టర్నింగ్ వద్ద ఉచిత దర్శనం, వీఐపీ క్యూ లైన్లతో కలిపి మొత్తం 5 క్యూ లైన్లు ఉంటాయన్నారు. కనకదుర్గానగర్, కొండపైన ఓం టర్నింగ్ వద్ద ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేసి 25 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు గౌతమి శాలి, కృష్ణమూర్తి నాయుడు, అడిషనల్ డీసీపీలు జి.రామకృష్ణ, ఎం.రాజారావు, డీఆర్వోలు వి.శ్రీనివాసరావు, ఆర్డీవో భవాని శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, దేవస్థానం ఈఈలు ఎల్.రమ, కోటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అలంకరణ సామగ్రికి.. వరద మరక





అలంకరణ సామగ్రి వరద నీటిలో మునిగి కనిపిస్తున్నాయి. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ 100 అడుగుల రోడ్‌లో బుడమేరు ముంపు కారణంగా ఫైబర్‌తో తయారు చేసిన మండపాల అలంకరణకు ఉపయోగించే వివిధ రకాల బొమ్మలు వరదలో మునిగి ప్రస్తుతం ఎందుకు పనికి రాకుండా పోయాయి. వీటిని శుభ్రం చేసే పనిలో అక్కడి కార్మికులు ఉన్నారు. ఈ దృశ్యాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

'పీఎం సూర్యఘర్'ను వినియోగించుకోండి

కృష్ణా కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధాన మంత్రి సూర్య ఘర్ వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరమని దీన్ని వినియోగించుకోవాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం పీఎం సూర్య ఘర్ సౌర్య విద్యుత్ పథకంపై వర్క్‌షాపును నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పేరుతో సౌర్య విద్యుత్ పథకాన్ని దిగువ, మధ్య తరగతి వినియోగదారులకు ప్రయోజనం కోసం అమలు చేస్తోందన్నారు. సౌర విద్యుత్ పథకానికి బ్యాంకర్లు కూడా రుణ సదుపాయం అందిస్తారని నెలవారీ వాయిదాలతో తీర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ ఎం.భాస్కరరావు, డీఈ రామకృష్ణ, మాణిక్యాలరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులను వేగవంతం చేయండి

జిల్లాలో గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అవనిగడ్డ, గుడివాడ, పెడన నియోజకవర్గాల్లో గృహనిర్మాణం వెనుకబడి ఉందని ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. అక్టోబరు నెలాఖరు నాటికి 2,168 ఇళ్ల పైకప్పు స్థాయికి పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు మార్చితో గడువు ముగియనున్నందున ఈ లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని ఉంటే బిల్లులు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌పై శిక్షణ ఇవ్వండి



అధికారులతో మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ విధానంపై గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. జిల్లాస్థాయి శాండ్ కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ విధాన పోర్టల్‌ను గురువారం సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా ఇసుక బుకింగ్‌సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తోందని దీనికి సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఎనిమిది మాన్యువల్ ఇసుక రీచ్‌ల అనుమతులు ఫిబ్రవరిలో ముగియనుందన్నారు. జిల్లాలో ఇసుక కొరత ఏర్పడకుండా రెవెన్యూ, మైన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి కొత్త మాన్యువల్ రీచ్‌లు ముందుగానే గుర్తించాలన్నారు. ఇసుక ఆన్‌లైన్ విధానంలో గ్రీవెన్స్‌ను పరిష్కరించడానికి ఒక ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏజేసీ పురేంద్ర, జిల్లా భూగర్భజలవనరులశాఖాధికారి విజయవర్ధనరావు, డ్వామా పీడీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు పూర్తి విస్తీర్ణం తేల్చండి

- ఆక్రమణలపై సర్వే నంబర్లవారీగా నివేదిక రూపొందించండి
- అధికారులకు కలెక్టర్ సృజన ఆదేశం



బుడమేరు వివరాలను మ్యాప్‌లో కలెక్టర్‌కు వివరిస్తున్న అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు కాలువ పూర్తి విస్తీర్ణం ఎంతో తేల్చాలని, సర్వే నంబర్లతో సహా ఎంత ఆక్రమణకు గురైందో నివేదిక సమర్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం బుడమేరు ఆక్రమణల గుర్తింపునకు తీసుకోవాల్సిన చర్యలపై సర్వే, భూ రికార్డులు, వీఎంసీ, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా బుడమేరుకు ప్రమాదకర స్థాయిలో వరద పోటెత్తిందన్నారు. ఊహించని విధంగా 43 వేల క్యూసెక్కుల వరద రావడంతో గండ్లు పడ్డాయన్నారు. విజయవాడ రూరల్, నగర పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, రెండు లక్షలకు పైగా కుటుంబాల్లో వరదల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి సీఎం చంద్రబాబు ఆపరేషన్ బుడమేరు ప్రకటించారన్నారు. యుద్ధ ప్రాతిపదికన బుడమేరు ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం సిద్ధమవుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో బుడమేరు ఆక్రమణలకు సంబంధించి జలవనరుల శాఖ అర్బన్, నగర పరిధిలో బుడమేరు కాలువ విస్తీర్ణ నివేదికలను రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, జిల్లా సర్వే, నగరపాలక సంస్థ సర్వే విభాగం, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంగా ఆక్రమణలపై సర్వే నంబర్లతో సహా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.